# మహా ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం సాటిలేని కృతజ్ఞతా భావం

హజ్రత్ అమీరుల్ ముమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 07.08.2026 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సర్రె) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం

أَشۡهَدُ أَنۡ لَّآ إِلٰهَ إِلَّا اللّٰهُ وَحۡدَهٗ لَا شَرِيۡكَ لَهٗ وَأَشۡهَدُ أَنَّ مُحَمَّدًا عَبۡدُهٗ وَرَسُوۡلُهٗ. أَمَّا بَعۡدُ فَأَعُوۡذُ بِاللّٰهِ مِنَ الشَّيۡطٰنِ الرَّجِيۡمِ. بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ ۝ اَلۡحَمۡدُ لِلّٰهِ رَبِّ الۡعٰلَمِيۡنَ ۝ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ ۝ مٰلِكِ يَوۡمِ الدِّيۡنِ ۝ إِيَّاكَ نَعۡبُدُ وَإِيَّاكَ نَسۡتَعِيۡنُ ۝ اِهۡدِنَا الصِّرَاطَ الۡمُسۡتَقِيۡمَ ۝ صِرَاطَ الَّذِيۡنَ أَنۡعَمۡتَ عَلَيۡهِمۡ غَيۡرِ الۡمَغۡضُوۡبِ عَلَيۡهِمۡ وَلَا الضَّآلِّيۡنَ ۝

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయం పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు.

వార్షిక సభ (జల్సా సాలానాకు) ముందు, మహా ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి కృతజ్ఞతా భావ ప్రమాణాలు, వారి ఆచరణ, వారి అమూల్యమైన ప్రవచనాల గురించి నేను ప్రస్తావించాను. ఆ విషయానికి సంబంధించి ఈ రోజు కూడా మరికొన్ని విషయాలు వివరిస్తాను. అల్లాహ్ తఆలా పట్ల కృతజ్ఞత కలిగి ఉండటం వైపు దృష్టి సారిస్తూ, చిన్న చిన్న విషయాలకు సైతం కృతజ్ఞతలు తెలపాలని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశించారు. హజ్రత్ అనస్ బిన్ మాలిక్ రజియల్లాహు అన్హు ఉల్లేఖనం ప్రకారం దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ప్రవచించారు. తన దాసుడు తినే ప్రతి ముద్దకు లేదా త్రాగే ప్రతి గుక్కకు దేవునికి కృతజ్ఞతలు తెలపడం అల్లాహ్‌కు ఎంతో సంతోషాన్ని కలిగిస్తుంది.

హజ్రత్ ఆయిషా రజియల్లాహు అన్హా ఉల్లేఖనం ప్రకారం: ఒకరోజు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇంటికి వచ్చేసరికి అక్కడ ఒక రొట్టె ముక్క కింద పడి ఉండటం చూశారు. వారు ఆ రొట్టె ముక్కను పైకి తీసి, శుభ్రం చేసి తిన్నారు. ఆ తర్వాత ఇలా అన్నారు ఓ ఆయిషా! గౌరవించదగిన వస్తువులను గౌరవించు. ఎందుకంటే ఈ జీవనాధారమైన అనుగ్రహం ఒక జాతి నుండి దూరమైపోతే, అది మళ్ళీ వారికి తిరిగి లభించదు. కనుక ఇది వారి (స) పవిత్ర ఆచరణగా ఉండేది.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఒకవేళ మనం కూడా మన జీవనోపాధిలో శుభం ఆశిస్తే, అల్లాహ్ తఆలా ప్రసాదించిన ప్రతి చిన్న విషయానికి మనం అతనికి కృతజ్ఞతలు తెలుపుకోవలెను.

హజ్రత్ ఇబ్నే అబ్బాస్ రజియల్లాహు అన్హు ఇట్లు ఉల్లేఖించారు: మక్కా విజయం రోజున దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ ఉమ్మె హానీ (రజి) ఇంటికి విచ్చేశారు. అప్పుడు వారికి బాగా ఆకలిగా అనిపించింది. వారు తినడానికి మీ ఇంట్లో ఏదైనా ఉందా? అని అడిగారు. దానికి ఆమె నా దగ్గర ఎండిపోయిన రొట్టె ముక్కలు తప్ప మరేమీ లేవు. వీటిని మీ సమక్షంలో ఉంచడానికి నాకు సిగ్గుగా ఉందని మనవి చేశారు. అప్పుడు ప్రవక్త గారు వాటినే తీసుకురండని అన్నారు. ఆ తర్వాత ప్రవక్త గారు ఆ ఎండిపోయిన రొట్టె ముక్కలను నీటిలో వేసి మెత్తగా చేశారు. ఆమె కొంచెం ఉప్పు తీసుకువచ్చారు. ప్రవక్త గారు నంచుకోవడానికి ఏదైనా కూర ఉందా? అని అడిగారు. ఆమె కొద్దిగా సిరకా (Vinegar)

తప్పు మరేమీ లేదని విన్నవించారు. ప్రవక్త గారు దాన్నే తీసుకురండని చెప్పారు. వారు దానిని తన ఆహారంపై వేసుకుని, అల్లాహ్ తఆలాను స్తుతించారు. ఆపై ఇలా అన్నారు. సిరకా ఎంత అద్భుతమైన కూర! ఏ ఇంట్లోనైతే సిరకా ఉంటుందో, ఆ ఇల్లు పేదరికం పాలవదు.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఇవీ ప్రవక్త గారి కృతజ్ఞతా భావ ప్రమాణాలు! మనం ఈ అభివృద్ధి చెందిన దేశాలలో నివసిస్తూ, అల్లాహ్ తఆలా ప్రసాదించిన లెక్కలేనన్ని అనుగ్రహాలను అనుభవిస్తున్నప్పటికీ, అతనికి కృతజ్ఞతలు తెలుపుకోవడంలో మన బాధ్యతను సక్రమంగా నెరవేర్చడం లేదు.

హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ (రజి) ఇట్లు ఉపదేశించారు: ఒకవేళ మీ ఒంటిపై ఎప్పుడైనా చిరిగిన బట్ట ఉంటే, మీరు ఏడవడం మొదలుపెడతారు మరియు మా రాత ఎంత దారుణంగా ఉంది, మాకు వేసుకోవడానికి చిరిగిన బట్టలు దొరికాయని అంటారు. కానీ సహాబాలకు చిరిగిన బట్టలు దొరికినప్పుడు, వారి శిరస్సులు అల్లాహ్ తఆలా సమక్షంలో కృతజ్ఞతతో వంగిపోయేవి... వారు, మా దేవుడు మాకు ఎంత మంచి బట్టలు ఇచ్చాడు! అని అనేవారు. వారికి నాలుగు రోజుల తర్వాత ఎండిపోయిన రొట్టె ముక్క దొరికినా, సంతోషంతో వారి కళ్ళల్లో మెరుపు వచ్చేది, వారు అల్హందులిల్లాహ్ అని అనేవారు.

హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ (రజి) జమాఅత్ సభ్యులను ఉద్దేశించి ఇలా ఉపదేశించారు: దేవుడు మిమ్మల్ని ఏ ఉద్దేశంతో సృష్టించాడో ఆ భావన మీలో కలగనంతవరకు...మీరు చేయగలిగే పని ఏమిటి? దేవుడు మిమ్మల్ని ఎలాంటి ఉన్నత స్థానంలో నిలబెట్టాడంటే, మీ హృదయం ఎల్లప్పుడూ ఆనంద తరంగాలతో నిండి ఉండాలి మరియు మీలో ఎల్లప్పుడూ చైతన్యం, చురుకుదనం కనిపించవలెను. ఒకవేళ ఈ గుణం మీలో ఉత్పన్నమైతే, తక్షణమే మీలో ఎంతటి శక్తి వస్తుందంటే, చాలా తక్కువ ఆహారం లభించినా సరే, అది మిమ్మల్ని పనులు చేయడానికి సమర్థులుగా మారుస్తుంది.

హుజూరె అన్వర్ ఇట్లన్నారు: ఇది ప్రతి అహ్మదీకి సాధారణంగా మరియు ముఖ్యంగా 'వాక్ఫినే జిందగీ' (జీవిత సమర్పితులు) తమ కృతజ్ఞతా ప్రమాణాలను పెంచుకోవడానికి ఉపయోగించాల్సిన అద్భుతమైన మార్గం. దీని అవసరం ఎంతైనా ఉంది. అదేవిధంగా తమ భార్యాపిల్లలలో కూడా ఈ అవగాహనను పెంపొందించాల్సిన అవసరముంది. ఎందుకంటే ఏ మహత్తర లక్ష్యం కోసమైతే వాక్ఫిన్ తమ జీవితాలను అంకితం చేసుకున్నారో, అది చాలా గొప్ప లక్ష్యం. మరి అంతటి గొప్ప లక్ష్యాన్ని సాధించాలంటే, ఆ లక్ష్య సాధన కోసం కృషి చేసేవారి ఆదర్శాలు కూడా ఉన్నతంగా ఉండవలెను.

పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం నీరు త్రాగేటప్పుడు, పాత్ర నుండి నోటిని పక్కకు జరుపుతూ మూడు శ్వాసలలో నీరు త్రాగేవారు. ప్రతి శ్వాసలోనూ అల్లాహ్‌ను స్తుతించేవారు మరియు చివరి శ్వాసలో అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకునేవారు.

హుజూరె అన్వర్ సహీహ్ బుఖారీ నుండి హజ్రత్ అబూ హురైరా (రజి) గారికి సంబంధించిన ఒక సుదీర్ఘమైన సంఘటనను ఉల్లేఖించారు. అందులో ఆయన తీవ్రమైన ఆకలితో అలమటిస్తూ, దారిలో కూర్చుని, అటుగా వెళ్లేవారిని పవిత్ర ఖుర్ఆన్‌లోని ఆ సూక్తి అర్థాన్ని అడుగుతుండేవారు. ఆ సూక్తిలో (ఇతరులను యాచించకుండా) ఆత్మగౌరవంతో ఉండేవారి అవసరాలను గమనించాలని ఆదేశించబడింది. హజ్రత్ అబూ హురైరా (రజి) ఆ సూక్తి అర్థాన్ని హజ్రత్ అబూబకర్ (రజి) మరియు హజ్రత్ ఉమర్ (రజి)లను అడిగారు, కానీ వారు అబూ హురైరా గారి నిజమైన పరిస్థితిని గ్రహించలేకపోయారు. అయితే వారు పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారిని ఆ పవిత్ర సూక్తి అర్థం అడిగినప్పుడు,

ప్రవక్త గారు చిరునవ్వు నవ్వి నా వెనుక రా అని అన్నారు. ఆ తర్వాత ప్రవక్త గారు వారికి ఒక పాలు ఉన్న పాత్రను ఇచ్చారు. ఆ పాల పాత్ర నుండి 'అహ్లే సుఫ్ఫా' అందరూ పాలు త్రాగారు. ఆ చిన్న పాల పాత్రలో దేవుడు ఎంతటి శుభం ఇచ్చాడంటే అందరూ కడుపు నిండా పాలు త్రాగినప్పటికీ, ఆ పాత్రలో పాలు అలాగే మిగిలి ఉన్నాయి. ఆ తర్వాత పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆ పాల పాత్రను తీసుకుని, అందరికంటే ముందు అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలిపి, ఆ తర్వాత మిగిలిన పాలను త్రాగారు.

పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఎల్లప్పుడూ తనకు మేలు చేసినవారిని గుర్తుంచుకునేవారు మరియు వారిని ఎంతో ఉత్తమమైన రీతిలో ప్రస్తావించేవారు. ఉదాహరణకు వారు హజ్రత్ ఖదీజా రజియల్లాహు అన్హా గారిని ఎల్లప్పుడూ గుర్తుచేసుకునేవారు. అదేవిధంగా హజ్రత్ అబూబకర్ (రజి) గారిని కూడా ఎల్లప్పుడూ అటువంటి ఉన్నతమైన రీతిలోనే ప్రస్తావించేవారు.

ముస్లింలపై హింస తీవ్రమైనప్పుడు వారు అబిసీనియా వైపు వలస వెళ్ళారు, అక్కడి రాజు నజాషీ వారికి ఆశ్రయమిచ్చాడు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆ రాజు చేసిన ఈ ఉపకారాన్ని ఎన్నడూ మరచిపోలేదు మరియు ప్రతి సందర్భంలోనూ ఆ మేలును ప్రస్తావించేవారు.

ఖైబర్ యుద్ధం తర్వాత తిరుగు ప్రయాణంలో, పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి వివాహం హజ్రత్ సఫియ్యా రజియల్లాహు అన్హా గారితో జరిగింది. పెళ్ళి జరిగిన ఆ రాత్రంతా హజ్రత్ అబూ అయ్యూబ్ ఖాలిద్ బిన్ జైద్ (రజి) ప్రవక్త గారి గుడారం వెలుపల కాపలా కాశారు. ప్రవక్త గారు ఉదయాన్నే నిద్రలేచి, ఆయన కాపలా కాయడం చూసి, ఆయన నిష్కల్మషమైన భక్తిని మెచ్చుకుంటూ ఇలా దుఆ చేశారు. ఓ అల్లాహ్! అబూ అయ్యూబ్ రాత్రంతా నన్ను ఎలాగైతే కాపాడాడో, నీవు కూడా అతడిని అలాగే రక్షించు.

హజ్రత్ అమ్ర్ బిన్ అఖ్తబ్ (రజి) ఇట్లు ఉల్లేఖించారు: ఒకసారి పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తాగడానికి నీరు అడిగారు. నేను వారి కోసం నీరు తీసుకువచ్చాను, ఆ నీటిలో ఒక వెంట్రుక పడి ఉంది, నేను ఆ వెంట్రుకను తీసివేశాను. అప్పుడు ప్రవక్త గారు నాకు ఈ విధంగా దుఆ ఇచ్చారు. ఓ అల్లాహ్! ఇతడిని అందంగా మార్చు.

హజ్రత్ అనస్ (రజి) కొరకు ప్రవక్త గారు ధనధాన్యాలు, సంతానంలో శుభం కలగాలని దుఆ చేశారు. అందువల్ల హజ్రత్ అనస్ (రజి) ఇలా అంటారు. నా సంపద చాలా ఎక్కువగా ఉంది మరియు నా పిల్లలు, నా మనవడు-మనవరాళ్ల సంఖ్య ఈ రోజుకు వందకు చేరుకుంది.

పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హితబోధ చేస్తూ ఇలా ప్రవచించారు. ఎవరికైనా ఒక ఉపకారం చేయబడినప్పుడు, అతడు దానిని ప్రస్తావిస్తే, అతడు ఆ ఉపకారానికి తగిన హక్కును నెరవేర్చినట్లే. కానీ ఎవరైతే ఆ మేలును దాచిపెడతారో వారు ఆ ఉపకారానికి కృతఘ్నుత చూపినట్లే.

పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కానుకలను స్వీకరించేవారు మరియు వాటికి బదులుగా తాము కూడా కానుకలను ఇచ్చేవారు. వారిలా అన్నారు. ఎవరికైనా ఒక కానుక ఇవ్వబడినప్పుడు, అతనికి గనుక సామర్థ్యం ఉంటే ఆ కానుకకు బదులుగా మరొక కానుక ఇవ్వాలి. ఒకవేళ అంత సామర్థ్యం లేకపోతే, ఆ కానుక ఇచ్చిన వ్యక్తికి కృతజ్ఞతలు తెలుపవలెను.

పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం రాత్రివేళల్లో నమాజ్ (తహజ్జుద్) లో ఎంత ఎక్కువ సమయం నిలబడేవారంటే, వారి పాదాలు పగిలిపోయేవి. ఇది చూసి హజ్రత్ ఆయిషా (రజి) ఓ

అల్లాహ్ ప్రవక్తా! అల్లాహ్ మిమ్మల్ని మునుపటి మరియు తరువాతి పొరపాట్ల నుండి సురక్షితంగా ఉంచి నప్పటికీ, మీరెందుకు ఇలా చేస్తున్నారు? అని అడిగారు. దానికి ప్రవక్త గారు నేను ఒక కృతజ్ఞత గల దాసుడిగా మారడం నాకు ఇష్టం ఉండకూడదా? అని బదులిచ్చారు.

పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం నమాజ్‌లలో ఎంతగా ఏడుస్తూ, సుదీర్ఘంగా నిలబడే వారంటే వారి పాదాలు వాచిపోయేవి. సహాబాలు మీరు ఇంతగా ఎందుకు రోదిస్తూ ప్రార్థిస్తున్నారు? అని అడిగినప్పుడు ప్రవక్త గారు నేను నా ప్రభువుకు కృతజ్ఞత గల దాసుడిగా మారవద్దా? అని అనేవారు.

హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లనిరి. పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి ఈ ఉన్నతమైన స్థితి, మనం కూడా అల్లాహ్ తఆలా అనుగ్రహాలకు కృతజ్ఞులమై ఉంటూ, మన కృతజ్ఞతా భావాన్ని గొప్ప స్థాయికి తీసుకెళ్లాలని మనల్ని కోరుతోంది. కృతజ్ఞత చూపడం అంటే కూర్చోవడం కాదు. కృతజ్ఞతా భావం అనేది సత్కార్యాలలో మరింత పురోగతిని కోరుకుంటుంది. పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం దైవభీతి అత్యున్నత ప్రమాణాలపై ఉన్నారు. అందుకే వారు అత్యంత కృతజ్ఞత గల దాసుడు కావడంలో కూడా అత్యున్నత స్థానాన్ని సాధించారు, మనకు ఇలా బోధించారు ఒకవేళ మీరు అల్లాహ్ తఆలా స్వచ్ఛమైన దాసులుగా ఉండే హక్కును నెరవేర్చాలనుకుంటే, మీరు కూడా కృతజ్ఞత గల దాసులుగా మారండి. అల్లాహ్ మీపై తన అనుగ్రహాలను కురిపిస్తున్న కొద్దీ, మీరు మీ ఆరాధనా ప్రమాణాలను మరింత ఉన్నతంగా మార్చుకోండి, కృతజ్ఞతలు తెలుపుకోండి.

దైవ అనుగ్రహాలు లభించినప్పుడు నిర్లక్ష్యం రాకూడదు, సోమరులుగా మారకూడదు; బదులుగా ఆరాధనల ద్వారా ఆధ్యాత్మికంగా ఇంకా ఇంకా ముందుకు సాగాలి.

హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ (రజి) ఒకచోట ఇలా అన్నారు: నీ కారుణ్యాలే నన్ను అవిధేయుడిగా (గర్విష్ఠిగా) మార్చాయని అన్నవాడు మూర్ఖుడు. అంటే దేవుని అనుగ్రహాలే నన్ను కృతజ్ఞుడిగా మార్చడానికి బదులు అవిధేయుడిగా మార్చాయని అనడం తప్పు. దేవుని అనుగ్రహాలు మనిషిని ఎన్నటికీ గర్విష్ఠిగా లేదా తిరుగుబాటుదారుడిగా మార్చవు, అలా అనేవాడు తప్పుగా మాట్లాడుతున్నాడు. దైవ అనుగ్రహాలు మనిషిని మరింత కృతజ్ఞుడిగా, మరింత విధేయుడిగా మారుస్తాయి. కావున మీరు మునుపటికంటే ఎక్కువగా దేవునికి విధేయులుగా మారండి. ఎందుకంటే అల్లాహ్ తఆలా ఇలా ఆదేశిస్తున్నాడు. మీకు ఏదైతే ప్రసాదించబడిందో దానిపై మీరు గనుక కృతజ్ఞత చూపితే నేను మీకు ఇంకా ఎక్కువగా ప్రసాదిస్తాను.

అల్లాహ్ తఆలా మనల్ని నిజమైన కృతజ్ఞతాపరులుగా, నిజమైన ఆరాధకులుగా మార్చుగాక! మరియు మనం ఎల్లప్పుడూ అతని అనుగ్రహాలను పొందే వారిగా ఉందుముగాక! (ఆమీన్)

---

اَلْحَمْدُ لِلّٰہِ نَحْمَدُہٗ وَنَسْتَعِیْنُہٗ وَنَسْتَغْفِرُہٗ وَنُؤْمِنُ بِہٖ وَنَتَوَکَّلُ عَلَیْہِ۔ وَنَعُوْذُ بِاللّٰہِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَیِّئَاتِ اَعْمَالِنَا۔ مَنْ یَّھْدِہِ اللّٰہُ فَلَا مُضِلَّ لَہٗ وَمَنْ یُّضْلِلْہُ فَلَا ھَادِیَ لَہٗ۔ وَنَشْھَدُ اَنْ لَّآ اِلٰہَ اِلَّا اللّٰہُ وَنَشْھَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُہٗ وَرَسُوْلُہٗ۔ عِبَادَ اللّٰہِ رَحِمَکُمُ اللّٰہُ! اِنَّ اللّٰہَ یَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِیْتَآءِ ذِی الْقُرْبٰی وَیَنْھٰی عَنِ الْفَحْشَآءِ وَالْمُنْکَرِ وَالْبَغْیِ۔ یَعِظُکُمْ لَعَلَّکُمْ تَذَکَّرُوْنَ۔ اُذْکُرُوا اللّٰہَ یَذْکُرْکُمْ وَادْعُوْہُ یَسْتَجِبْ لَکُمْ وَلَذِکْرُ اللّٰہِ اَکْبَرُ۔